ఛాంపియన్‌గా పుణెరి పల్టాన్



5లో.

RNI NO :Title-Code :-TELTEL02102
# జర్నలిస్ట్ వార్త
తెలుగు దినపత్రిక
అనుక్షణం ప్రజలపక్షం...

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 158 శనివారం 2 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఇంటర్ విద్యార్థులకు ఊరట

**నిమిషం ఆలస్యం నిబంధన ఎత్తివేస్తూ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం**

**మార్చి 1(జర్నలిస్ట్ వార్త**
తెలంగాణ ఇంటర్మీడియేట్ బోర్డు ఇంటర్ విద్యార్థులకు ఊరటనిచ్చింది! పరీక్షకు నిమిషం ఆలస్యం నిబంధనను ఎత్తివేస్తూ శుక్రవారం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్ష హాలుకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అనుమతించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది.ఉదయం తొమ్మిది గంటల లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని గతంలో ఇంటర్ బోర్డు పేర్కొంది. తాజాగా 9 గంటల తర్వాత ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ అధికారులకు ఇంటర్ బోర్డు ఆదేశాలు జారీ చేసింది.

# మేడిగడ్డపై కాంగ్రెస్ చెప్పేవి అన్నీ అబద్ధాలే



2లో.

మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏర్పడిన చిన్న సమస్యను చాలా పెద్దది చేసి చూపిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. శుక్రవారం బీఆర్ ఎస్ నేతలు 'ఛలో మేడిగడ్డ' చేపట్టిన విషయం తెలిసిందే.

- మేడిగడ్డ బ్యారేజీలో చిన్న సమస్యను పెద్దది చేసి చూపిస్తున్నారు: కేటీఆర్
- మేడిగడ్డ కుంగుబాటుపై నిపుణులతో కమిటీ వేయాలని సూచన
- వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిమాండ్
- చిన్న సమస్యను భూతద్దంలో చూపించి కాళేశ్వరం ప్రాజెక్టే అనవసరంగా కట్టారని చెప్పే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం
- కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లవాగు రెండుసార్లు కొట్టుకుపోయాయన్న కేటీఆర్
- నాగార్జున సాగర్, శ్రీశైలంలోనూ లీకేజీలు వచ్చినప్పటికీ తాము వాటిని రాజకీయం చేయలేదన్న కేటీఆర్

# త్వరలో రైతు కమిషన్

**కీలక నిర్ణయం దిశగా ప్రభుత్వం అడుగులు!**
**, ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి**
**పౌర సమాజం ప్రతినిధులతో జరిగిన సమావేశంలో వెల్లడి**
**పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయనున్నామని వెల్లడి**
**రైతు భరోసా ఎవరికి ఇవ్వాలనే దానిపై విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామన్న సీఎం**



**మార్చి 1(జర్నలిస్ట్ వార్త**
రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగు వేస్తోంది. రైతు కమిషన్, ఎడ్యుకేషన్ కమిషన్‌లను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. శుక్రవారం పౌర సమాజం ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... రైతు కమిషన్, ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. త్వరలో ఈ రెండు కమిషన్లను ప్రకటిస్తామన్నారు. మన విద్యా విధానం ఎలా ఉండాలో ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుందని తెలిపారు. ఒకే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో 25 ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేస్తామని, పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో ఉన్న చిక్కుముడులు తొలగించి ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. యూపీఎస్సీ తరహాలో టీఎస్పీఎస్సీ ద్వారా నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేయబోతున్నామన్నారు. కౌలు రైతుల రక్షణకు సంబంధించి అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అందరి సూచనలు, సలహాలు ఆధారంగా కౌలు రైతుల రక్షణకు చట్టం తీసుకురావాలని యోచిస్తున్నట్లు చెప్పారు. రైతు భరోసా అనేది పెట్టుబడి సాయమని, రైతు భరోసా ఎవరికి ఇవ్వాలనే దానిపై విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామన్నారు.

# బెంగళూరులో పేలుడు...


**హైదరాబాద్‌లో హైఅలర్ట్ ప్రకటించిన పోలీసులు**
**బెంగళూరులోని రామేశ్వరం కేఫ్‌లో పేలుడు కలకలం**
**అప్రమత్తమైన హైదరాబాద్ పోలీసులు**



**మార్చి 1(జర్నలిస్ట్ వార్త**
కర్ణాటక రాజధాని బెంగళూరులో ప్రసిద్ధ 'రామేశ్వరం కేఫ్'లో బాంబు పేలుడు నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలో హైఅలర్ట్ ప్రకటించారు. కీలక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లుగా హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులను అప్రమత్తం చేశామని తెలిపారు. బెంగళూరు కుందలహళ్లిలోని రామేశ్వరం కేఫ్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం పేలుడు కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ పేలుడు ధాటికి తొమ్మిది మంది గాయపడ్డారు. గుర్తు తెలియని వ్యక్తి కేఫ్‌లో ఉంచి వెళ్లిన బ్యాగు కారణంగా పేలుడు సంభవించినట్లు నిర్ధారించారు.

# అమల్లోకి జీరో బిల్లు

**అమల్లోకి గృహజ్యోతి పథకం.. జీరో బిల్లులు జారీచేస్తున్న విద్యుత్ సిబ్బంది**
**జీరో బిల్లు కోసం సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేసిన ప్రభుత్వం**
**మండల కార్యాలయాల్లో మరోమారు దరఖాస్తు చేసుకోవాలన్న ప్రభుత్వం**
**అన్ని సెక్షన్లలోనూ జారీ చేస్తున్న సిబ్బంది**



**మార్చి 1(జర్నలిస్ట్ వార్త**
ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీల్లో మరో గ్యారెంటీ నేటి నుంచి అమల్లోకి వచ్చింది. గృహజ్యోతి పథకంలో భాగంగా అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారులకు నేటి నుంచి జీరో విద్యుత్ బిల్లులు జారీ అవుతున్నాయి. జీరో బిల్లింగ్ కోసం సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని సెక్షన్లలోనూ నేటి నుంచి 200 లోపు యూనిట్లు వినియోగించుకునే లబ్ధిదారులకు జీరో బిల్లులు జారీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గృహజ్యోతి పథకానికి అన్ని అర్హతలు ఉండి కూడా జీరో విద్యుత్ బిల్లు రాకుంటే దగ్గర్లో ఉన్న మున్సిపల్, మండల కార్యాలయాలకు వెళ్లి మరోమారు దరఖాస్తు చేసుకోవాలి. ఈ సందర్భంగా తెల్ల రేషన్‌కార్డు, దానికి లింక్ చేసిన ఆధార్‌కార్డ్, విద్యుత్ కనెక్షన్ నంబర్‌ను సమర్పించాలి. కాగా, ఈ పథకానికి ఇప్పటి వరకు 1,09,01,255 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో రేషన్ కార్డులు ఉన్న వారి సంఖ్య 64 లక్షలు మాత్రమే. వీరిలో 34,59,585 మందిని మాత్రమే ప్రభుత్వం అర్హులుగా తేల్చింది.

# బిఆర్ఎస్ కు ఎంపి బిబి పాటిల్ గుడ్ బై



**మార్చి 1(జర్నలిస్ట్ వార్త:**
జహీరాబాద్: పార్లమెంట్ ఎన్నికలకు ముందు బిఆర్ఎస్ కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. బిఆర్ఎస్ ఎంపిలు ఒక్కొక్కరుగా పార్టీకి రాజీనామా చేస్తూ బిజెపిలో చేరుతున్నారు. తాజాగా శుక్రవారం జహీరాబాద్ ఎంపి బిబి పాటిల్ బిఆర్ఎస్ కు రాజీనామా చేశారు. ఈరోజుల ఢిల్లీలో బిజెపి అగ్రనేత తరుణ్ చుగ్ సమక్షంలో పాటిల్ కమలం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తరుణ్ చుగ్.. ఆయనకు పార్టీ కండువా కప్పి బిజెపిలోకి ఆహ్వానించారు.అనంతరం తరుణ్ చుగ్ మాట్లాడుతూ.. తెలంగాణను బిఆర్ఎస్ చర నుంచి విడిపించామన్నారు. ఇక బిఆర్ఎస్ లో ఎవరూ మిగలరని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతోనే బిఆర్ఎస్ పని అయిపోయిందని%ా% ఇప్పుడు బిజెపి, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉంటుందన్నారు. తెలంగాణలో ఈసారి మెజార్టీ స్థానాలను బిజెపి గెలుస్తుందని.. రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తరుణ్ చుగ్ అన్నారు. కాగా, నిన్న నాగర్ కర్నూల్ ఎంపి రాములు తన కొడుకుతో కలిసి బిజెపిలో జాయిన్ అయ్యారు.

# నల్లగొండ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చెయ్..

## కటీఆర్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్



**మార్చి 1జర్నలిస్ట్ వార్త:** హైదరాబాద్: సిరిసిల్ల ఎమ్మెల్యే పదవికి కేటీ ఆర్ రాజీనామా చేసి నల్లగొండ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ విసిరారు. తాను సైతం నల్ల గొండ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ప్రకటించారు. నల్లగొండలో కేటీఆర్ ఓటమి ఖాయమని, ఇక కారు షెడ్డు మూసుకోక తప్పదన్నారు.కేటీఆర్ ఓడిపోతే బీఆర్ఎస్ పార్టీని మూసివేస్తాం అని కేసీఆర్ ప్రకట న చేస్తారా? అని సవాల్ విసిరారు. తాను సిరిసి ల్లలో ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటాన ని స్పష్టం చేశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి శుక్రవారం సచివాల యంలో మీడియాతో మంత్రి కోమటిరెడ్డి మాట్లా డారు. కేటీఆర్‌కు క్యారెక్టర్ లేదని కానీ రూ. లక్షల కోట్లు ఉన్నాయని, తనకు క్యారెక్టర్ ఉందని కానీ డబ్బులు లేవన్నారు. కేటీఆర్ సిరిసిల్లలో రూ.200 కోట్లు ఖర్చు చేసి 30 వేల ఓట్లతో గెలిచాడని, తానై తే అలా గెలిస్తే రాజీనామా చేసేవాడినన్నారు.మాకు ప్రత్యర్థి బీజేపీనే...లోక్‌సభ ఎన్నికల్లో మాకు ప్రత్యర్థి బీఆర్ఎస్ కాదని, బీజేపీనే అని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పోటీలో లేదని, బీజేపీకి రెండు, మూడు సీట్లు వస్తాయో లేదో తెలియదన్నా రు. బీజేపీ ఎంపీ డి.అర్వింద్‌ను ప్రజలు ఎప్పు డో మరిచిపోయారని కోమటిరెడ్డి చెప్పారు. రాజకీ యాల వల్ల ఆస్తులు పోగొట్టుకున్నామని, తనతో పాటు ఉత్తమ్ ఆస్తులు తగ్గాయన్నారు. తన పేరు మీద ఆస్తులుంటే అర్వింద్‌కు ఇచ్చేస్తానని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ, భువనగిరిలలో ఎక్కడి నుంచైనా పోటీ చేయాలని రాహుల్ గాంధీకి ప్రతిపాదించామని తెలిపారు.

# మోదీతో దీదీ భేటీ..


## ప్రొటోకాల్ ప్రకారమే కలిశానని వ్యాఖ్య



**మార్చి 1జర్నలిస్ట్ వార్త:**
కోల్‌కతా: ప్రధాని నరేంద్ర మోదీతో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సమావేశమయ్యారు.రెండు రోజుల పర్యటన కోసం రాష్ట్రానికి వచ్చిన ప్రధాని శుక్రవారం రాత్రికి రాజ్‌భవన్‌లోనే ఉండనున్నారు. ఈనేపథ్యంలో సీఎం మమత, ప్రధానితో సమావేశమయ్యారు. గతేడాది డిసెంబర్‌లో తమ రాష్ట్రానికి రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని కోరుతూ దిల్లీలో కలిసిన తర్వాత మళ్లీ ప్రధాని మోదీని కలవడం ఇదే తొలిసారి.మోదీతో భేటీ అనంతరం మమత మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్రపతి లేదా ప్రధానమంత్రి రాష్ట్రాన్ని సందర్శిస్తే సీఎం వెళ్లి వారిని కలవడం ఓ ప్రొటోకాల్ అన్నారు. ఇది మర్యాదపూర్వక భేటీయేనని.. రాజకీయ అంశాలేవీ చర్చించలేదన్నారు. ఎందుకంటే ఇది రాజకీయ సమావేశం కాదని చెప్పారు. ఇదిలాఉండగా.. తమ రాష్ట్రానికి కేంద్రం నుంచి రూ.1.18లక్షల కోట్ల బకాయిలు రావాలని తృణమూల్ కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. 2022 మార్చి నుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు 30 లక్షల మంది నరేగా కార్మికులకు ?2,700 కోట్ల బకాయిల చెల్లింపును రాష్ట్ర ప్రభుత్వం సోమవారమే ప్రారంభించింది.

# జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు

## జే.ఎన్.జే.సభ్యులు సహా అందరికీ లబ్ధి,నగరానికి నలువైపులా ఇళ్లు,ఇళ్ల స్థలాలు, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి



సూర్యాపేట టౌన్, **మార్చి 1(జర్నలిస్ట్ వార్త:**
జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం త్వరలో పరిష్కరిస్తుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెండున్నర లక్షల చొప్పున చెల్లించి గడిచిన 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించేందుకు సీ.ఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని చెప్పారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల సంఘాలు, ప్రతినిధులు, హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో త్వరలో సమావేశమై ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. హైదరాబాద్‌లో జర్నలిస్టులకు నగరానికి నాలుగు వైపుల స్థలాలను గుర్తించి ఎవరికి ఎక్కడ అనువైతే అక్కడే ఇచ్చేలా అవకాశాలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దైనందిన సమస్యలతో జర్నలిస్టులు వృత్తిపరమైన నైపుణ్యతపై దృష్టి సారించలేకపోతున్నారని, మీడియా అకాడమీ వారిలో నైపుణ్యతను పెంచడానికి కృషి చేయాలన్నారు. అకాడెమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అక్రిడిటేషన్, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల వంటి సమస్యలను సంబంధం లేకుండానే అకాడెమీకి అప్పగించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయన్నార. సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, సీ.ఎం సీ.పీ.ఆర్.ఓ అయోధ్య రెడ్డి, ఏ.పీ ప్రభుత్వ సలహాదారు దేవులపల్లి అమర్, సీ.పీ.ఐ నాయకులు డాక్టర్ కె.నారాయణ, పల్లా వెంకట్‌రెడ్డి, సియాసత్ ఎడిటర్ అమెర్ అలీఖాన్, ఏ.పీ.యూ.డబ్ల్యూ.జే ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, టీ.యూ.డబ్ల్యూ.జే ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హ న్మంతరావు పాల్గొన్నారు..


# మేడిగడ్డపై కాంగ్రెస్ చెప్పేవి అన్నీఅబద్ధాలే



**మార్చి 1జర్నలిస్ట్ వార్త:** మేడిగడ్డ బ్యారేజీలోని 86 పిల్లర్లలో ఒకటి కుంగిపోతే కాంగ్రెస్ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్. అన్నారు.. మేడిగడ్డ ను బి అర్ ఎస్ బృందం నేడు పరిశీలించింది. ఆనంతరం ప్రాజెక్టు వద్ద పవర్ పాయింట్ ప్రజెంటెషన్ ఇచ్చారు.
కాళేశ్వరం ప్రాజెక్టు 100 అంకాలలో మేడిగడ్డ బ్యారేజీ ఒకటి అని తెలిపారు. 1.6 కిలోమీటర్ల మేడిగడ్డలో చిన్న సమస్యను పెద్దదిగా చూపుతున్నారని మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ రిపేర్ చేయొచ్చని ఇంజనీర్లు చెబుతున్నారని వాటిని కూడా రిపేర్ చేయించలేని అసమర్థ ప్రభుత్వమా మీది అంటూ రేవంత్ సర్కార్ ను నిలదీశారు
తమపై కోపం ఉంటే తమ మీదనే చూపాలని కానీ రైతులకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధ రించాలని కోరారు. అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కరీంనగర్‌లో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. రైతులపై పగపట్టొద్దని.. వరదలు వచ్చేలోగా ప్రాజెక్టును పునరుద్ధరించాలని కేటీఆర్ కోరారురాబోయే రోజుల్లో పంటలు ఎండిపోకూడదంటే.. కామధేనువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లలను సరి చేయకుండా.. కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. .
కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ నాయకులు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు వాస్తవాలు తెలియజేసేందుకు చలో మేడిగడ్డ పర్యటనకు వచ్చామని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా మేడిగడ్డ, అన్నారం బరాజ్‌ను సందర్శించామని, . కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని ఈ రాష్ట్ర ప్రజలకు ప్రతి ఒక్కరికి అర్థమయ్యే విధంగా తెలియజేస్తామని పేర్కొన్నారు .
. ఇది మొదటి అడుగు మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బరాజ్ అన్నట్టు కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మూడు బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల టన్నెల్స్, 1500 కిలోమీటర్ల కెనాల్స్ కలిపితే కాళేశ్వరం అని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లాభం జరగబోయే ఆయకట్టు రైతాంగానికి వాస్తవాలు చెప్పాల్సిన అసవరం ఉందన్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం. 1.6 కి.మీ. మేడిగడ్డ బరాజ్‌లో 83 పిల్లర్లు ఉన్నాయి. అందులో మూడు పిల్లర్లు వద్ద సమస్య వస్తే మొత్తం కాళేశ్వరం వృథా అయిందని కాంగ్రెస్ పార్టీ దుర్మార్గంగా ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల పక్షాన ప్రధాన ప్రతిపక్షంగా పోరాడుతాం. మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేసి నీళ్లు విడుదల చేయాలి. బీఆర్ఎస్‌పై బురద జల్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని కేటీఆర్ పేర్కొన్నారు

# పాలమూరు’పై భారాస అసత్యాలు..

## ప్రాజెక్టు జలాశయాలను పరిశీలించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



**మార్చి 1జర్నలిస్ట్ వార్త:**
మహబూబ్‌నగర్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేశామని భారాస అసత్యాలు చెబుతోందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు వంశీచంద్‌రెడ్డి విమర్శించారు.ఈ ప్రాజెక్టు నుంచి ఇంతవరకు చుక్కనీరు కూడా ఇవ్వలేదన్నారు. ‘‘ఇటీవల నల్గొండలో కేసీఆర్ మాట్లాడుతూ పాలమూరుకు చెందిన 80% పనులు పూర్తిచేశామని అబద్ధాలు చెప్పారు. ప్రాజెక్టుకు కేటాయించిన నిధుల్లో 80% దోచుకుని 20 శాతం పనులే చేశారు’’ అని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కర్వెన, ఉదండాపూర్ జలాశయాలను శుక్రవారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి (మహబూబ్‌నగర్), జె.అనిరుధ్‌రెడ్డి (జడ్చర్ల), జి.మధుసూదన్‌రెడ్డి (దేవరకద్ర), చిట్టెం పర్ణికారెడ్డి (నారాయణపేట), వి.శ్రీహరి (మక్తల్), వి.శంకర్ (షాద్‌నగర్)లతో కలిసి ‘చలో పాలమూరు-రంగారెడ్డి’ పేరుతో వంశీచంద్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జలాశయాల వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ‘‘2015లో పాలమూరు ఎత్తిపోతల పథకానికి కేసీఆర్ శంకుస్థాపన చేసినప్పుడు ఇక్కడే కుర్చీ వేసుకుని కూర్చొని మూడేళ్లలో ప్రాజెక్టు పనుల్ని పూర్తిచేస్తామని చెప్పారు. ఈ పథకాన్ని నాటి భారాస ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఈ ప్రాంతానికి జీవనాధారమైన కృష్ణా నదిలో తెలంగాణ వాటాను కూడా కేసీఆర్ సాధించలేకపోయారు. కృష్ణా జలాల్లో మన వాటాను పెన్నా బేసిన్‌కు తరలించుకుపోతుంటే పట్టించుకోలేదు. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 44 వేల నుంచి 97 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచినప్పుడు కేసీఆర్ ఏంచేశారు? భారాస నేతలు మేడిగడ్డ ప్రయాణం.. అంటూ మోసంచేస్తే ప్రజలే ఆ పార్టీకి బుద్ధి చెబుతారు. కర్వెన ప్రాజెక్టులో నాసిరకం పనులు జరిగాయి. జలాశయంలోకి వర్షపు నీళ్లు వచ్చి నిలిస్తేనే కట్ట నుంచి లీకవుతున్నాయి. ఉదండాపూర్‌లో 80% పనులు పూర్తయ్యాయంటున్నారు.. కానీ ఇక్కడ కేవలం 20-30 శాతం పనులు మాత్రమే జరిగాయి. షాద్‌నగర్ నియోజకవర్గంలోని లక్ష్మీదేవిపల్లి జలాశయం ఊసేలేదు. పాలమూరు ప్రాజెక్టు పరిధిలో ఇంతవరకు కాలువలే నిర్మించలేదు. కనీసం రిజర్వాయర్లు కూడా పూర్తిస్థాయిలో చేపట్టలేదు’’ అని విమర్శించారు. పాలమూరులో ప్రస్తుతం అందుతున్న సాగునీరు నాడు వైఎస్ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకాల ద్వారానే అని చెప్పారు. మళ్లీ ఈ జిల్లాకు నీళ్లు రావాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు.
లక్ష్మీదేవిపల్లి వద్ద జలాశయం నిర్మిస్తే పాలమూరు జిల్లా సస్యశ్యామలానికి నాంది పడుతుందని గతంలో కేసీఆర్ చెప్పినా.. ఇక్కడ పదేళ్లలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని వంశీచంద్‌రెడ్డి, వి.శంకర్ ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగూడెం మండలంలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు స్థలంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, మధుసూదన్‌రెడ్డిబీ పరిగి, తాండూరు శాసనసభ్యులు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలతో కలిసి శుక్రవారం సమావేశం ఏర్పాటుచేశారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి భారాస నేతలు మేడిగడ్డను పరిశీలించడానికి బయలుదేరితే.. ప్రకృతి సైతం సహకరించక వెళుతున్న బస్సు పంక్చర్ అయిందని శంకర్ విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల డిజైన్ తానే స్వయంగా రూపొందించానని కేసీఆర్ నాడు చెప్పారని, నేడు నిపుణుల కమిటీ డిజైన్ లోపం కారణంగానే మేడిగడ్డ కుంగిపోయినట్లు ధ్రువీకరించినా.. బాధ్యత ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తీసుకోవాలని భారాస నాయకులు చెప్పడం సిగ్గుచేటని రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునీత, పాలమూరు, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన ఇతర పార్టీల నేతలు

## - పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షురాలు స్వర్ణ



వర్ధన్నపేట, మార్చి1(జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట మండల అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించిన జక్కి శ్రీకాంత్ గతంలో పార్టీని వదిలి బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సమక్షంలో తిరిగి సొంత పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు స్వర్ణ రాజేశ్వర్ రావు జక్కి శ్రీకాంత్ కి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు వరంగల్ పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి సాంబయ్య వివిధ పార్టీల నేతలను కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికల్లో శ్రీకాంత్ తో పాటు అంబేద్కర్ నగర్ టిఆర్ఎస్ నాయకులు, మాజీ వార్డ్ మెంబర్లు సూరారపు రవికుమార్, ఎమ్మార్పీఎస్ వర్ధన్నపేట మండల అధ్యక్షులు చిన్నపెల్లి రాజు, అంబేద్కర్ సంఘం నాయకులు చిన్నపెల్లి కుమార్, బుర్ర చందర్, బిర్రు యాకయ్య తో పాటు 50 మంది బిఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పనిచేసిన నాయకులను పార్టీ ఎప్పటికీ వదులుకోదన్నారు. కార్యకర్తల కృషి వల్లనే నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. అధిష్టాన నిర్ణయం మేరకు కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన నాయకులను తిరిగి పార్టీలోకి చేర్చుకోవడం జరిగిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్యకర్తలంతా కృషి చేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాల్సిన భాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను వంద రోజులలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే నాలుగు హామీలను అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మండల సీనియర్ నాయకులు కర్ర శ్రీనివాస్ రెడ్డి, పోలసాని దేవేందర్ రావు, అడ్వకేట్ బర్ల సహదేవ్, చింత బాబు, మరిపట్ల బాబు, మరిపట్ల ఏలియా, బిర్రి యాకయ్య, తాటికాయల సమ్మయ్య, కందిక చంద్రయ్య, నాగరాజు, రమేష్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



రాయపర్తి, మార్చి1(జర్నలిస్ట్ వార్త): మండలంలోని మోరిపిరాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బిటుకూరి మల్లేష్ కుమారుడైన హరీష్ కుమార్ రాధిక వివాహ వేడుకలకు శుక్రవారం రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట బిఆర్ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, బిఆర్ఎస్ నాయకులు అనిరెడ్డి యాకూబ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవల కోసం ఆర్థిక సహాయం అందించిన శ్రీనివాస్ రెడ్డి



రాయపర్తి, మార్చి1(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం సన్నూరు గ్రామం జయరాం తండకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తేజావత్ సంతోష్ నాయక్ కుమారుడు ప్రభాస్ (18) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడినారు. హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం సమాచారం తెలుసుకున్న ఎస్ఆర్ఆర్ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఆసుపత్రికి చేరుకున్నారు. అనంతరం బాధితున్ని, తన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధితుని మెరుగైన వైద్య సేవల కొరకు 21 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయండి



**కొడకండ్ల, మార్చి 1(జర్నలిస్ట్ వార్త):** పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ అధ్యక్షత శుక్రవారం గిరిజన నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాలు పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో నేడు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబోయే జయంతి వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

బంజారాల సంస్కృతి, ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంతా సంచరిస్తూ, బంజారాలకు హితబోధ చేసిన మహోన్నతమైన వ్యక్తి సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ అన్నారు. 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా రాంజీ నాయక్ తండాలో సేవాలాల్ మహారాజ్ జన్మించారు. జగదాంబ మాతనే తన మార్గదర్శకురాలిగా, గురువుగా స్వీకరించి, ఆమె ఆదేశానుసారం బంజారాల సేవలో నిమగ్నమయ్యారు. సేవాలాల్ బంజారా ప్రజల మూఢవిశ్వాసమైన జంతుబలికి తీవ్ర వ్యతిరేకి అన్నారు. బంజారాలు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు వివిధ రాజ్యాలకు అవసరమైన సామాగ్రిని చేరవేస్తూ, సంచార జీవనం సాగిస్తూ ఉండేవారు. ఈ క్రమంలో బ్రిటిష్, ముస్లిం పాలకుల మత ప్రచారం వల్ల బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురైందన్నారు. ఈ క్రమంలోనే బంజారా జాతి సన్మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహారాజ్ అవతరించారని అన్నారు. బంజారాల అభివృద్ధి కోసం పోరాడిన సేవాలాల్ ఆకాంక్షను నెరవేర్చే విధంగా జాతీయ వివక్షతకు గురవుతూ, ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంఘిక అభివృద్ధిలో వెనకబడిన బంజారాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నేటి ప్రభుత్వాలపై ఉందన్నారు. దేశంలో బంజారాల జనాభా సుమారు 14 కోట్లని చెప్పుకొచ్చారు. బంజారా ఆరాధ్య దైవమైన సేవలాల్ మహారాజ్ జీవితం బంజారాలకు మాత్రమే కాకుండా యావత్ సమాజానికి ఆదర్శప్రాయమన్నారు. ఈ సమావేశంలో మండల స్థాయి గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తి సోమనాథుడి మహా జాతర క్యాలేడర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి




పాలకుర్తి, మార్చి1(జర్నలిస్ట్ వార్త): పాలకుర్తి మండలం ఎంపీడీఓ కార్యాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి సోమనాథుడి జాతర అద్భుతంగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఆటంకాలు ఏర్పడకుండా చూసుకోవాలన్నారు. జాతర నిర్వహణపై అధికారులంతా అప్రమతంగా ఉండాలన్నారు. అనంతరం సోమనాథుడి మహా జాతర క్యాలేడర్ ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. పాలకుర్తి చరిత్రలో మునుపెన్నడూ జరగని రీతిలో మహాశివరాత్రి జాతర జరగాలని అధికారులకు సూచన చేశారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనలో భాగంగా అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫసల్‌బీమా అమలు చేస్తాం

## : సిఎం రేవంత్ రెడ్డి




**మార్చి 1జర్నలిస్ట్ వార్త:** హైదరాబాద్: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో తెలంగాణ మళ్లీ చేరింది. గతంలో 2016 నుంచి 2020 వరకు కొనసాగింది. ఆ తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అయితే ఈ రోజు సాయంత్రం కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి రితేశ్ చౌహాన్ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుపై చర్చించారు. తిరిగి ఇందులో చేరాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే పంటకాలం నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన తెలంగాణలో అమలు కానుంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలోకి (%భావీఖీద్%) తెలంగాణ ప్రభుత్వం తిరిగి చేరడంతో వచ్చే పంట కాలం నుంచి రైతులు ఈ పథకం నుంచి పంటల బీమా పొందనున్నారు. %భావీఖీద్%తో రైతులకు ప్రయోజనం కలుగుతుందని, పంటలు నష్టపోయినప్పుడు సకాలంలోనే పరిహారం అందుతుందని రితేష్ చౌహాన్ ఈ సందర్భంగా సీఎంకు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో రైతు కేంద్రిత విధానాల అమలుకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. రైతులకు దన్నుగా నిలుస్తూ సాగు రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సాగు రంగంలోని ప్రతికూలతలు తట్టుకుంటూ రైతులకు రక్షణగా నిలిచేందుకు %భావీఖీద్%లో రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చేరినట్లు తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి రితేశ్ చౌహాన్‌తో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారు.

# పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన పాలకుర్తి ఎమ్మెల్యే



పాలకుర్తి మార్చి1(జర్నలిస్ట్ వార్త): పాలకుర్తి మండలం వావిలాల గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనుల ప్రారంభానికి శుక్రవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం మలంపల్లి గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమౌతుందని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి, పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు కుమారస్వామి, భాస్కర్, ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఉచిత పథకాల పేరుతో రేవంత్ రెడ్డి బిచ్చగాళ్లను చేస్తున్నాడు : బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



**మార్చి 1జర్నలిస్ట్ వార్త:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉచిత పథకాల పేరుతో తెలంగాణ ప్రజలను బిచ్చగాళ్లను చేస్తున్నారని బీజేపీ నేత, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. హన్మకొండ బీజేపీ విజయ సంకల్ప యాత్రలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఆ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేస్తే దేశం మళ్లీ ముక్కలవుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేనేజ్‌మెంట్, పేమెంట్ కోటా రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్ అయితే, అభివృద్ధికి కేరాఫ్ బీజేపీ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులో అవినీతికి పాల్పడిన అందరినీ అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలన్నారు.
రేవంత్ రెడ్డి ప్రభుత్వం తుమ్మితే ఊడిపోయే ముక్కులా ఉందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి తన స్థాయికి తగినట్లు మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. రేవంత్ రెడ్డి కేరళలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీపై యుద్ధం చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అలా యుద్ధం చేస్తామన్న సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు ఇప్పుడు ఇంట్లో కూర్చున్నారని ఎద్దేవా చేశారు.


# అధిష్టానం ఆదేశిస్తే అమిత్ ను పోటీలో నిలుపుతా.. శాసన మండలి చైర్మెన్ గుత్తా



**మార్చి 1జర్నలిస్ట్ వార్త:** యాదాద్రి : అధిష్టానం ఆదేశిస్తే తనయుడు అమిత్ ను భువనగిరి పార్లమెంట్ బరిలో నిలుపుతానని శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాలోని భువనగిరి మండలం నమాత్ పల్లి గ్రామంలో సుదర్శన నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సంధర్భంగా మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. భువనగిరి ప్రాంతంతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని, తాను మదర్ డైరీ చైర్మన్ గా, ఎంపీగా పనిచేసిన నాటి నుండి నేటి వరకు అందరితో మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపారు. అధిష్టానం ఆదేశిస్తే ఇక్కడి నుండి ఎంపీగా నా తనయుడు గుత్తా అమిత్ రెడ్డి పోటీకి సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. గుత్తా అమిత్ రెడ్డి ఎంపీగా పోటీ చేసే విషయంలో అదిష్టానం నిర్ణయమే శిరోధార్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమ వెంకటేశ్వర్లు, రిటైర్డు వార్డెన్స్ సంఘం అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు

# హైదరాబాదులో వాయుసేన విమానానికి తప్పిన ప్రమాదం

**వాయుసేన శిక్షణ విమానంలో సాంకేతికలోపం**
**తెరుచుకోని హైడ్రాలిక్ వింగ్స్**
**40 నిమిషాల పాటు గాల్లోనే చక్కర్లు కొట్టిన విమానం**
**ఎట్టకేలకు బేగంపేట విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్**
**విమానంలోని మొత్తం 12 మంది సురక్షితం**



**మార్చి 1జర్నలిస్ట్ వార్త:**
భారత వాయుసేనకు చెందిన విమానాలు కొన్ని దశాబ్దాలుగా ప్రమాదాలకు గురికావడం తెలిసిందే. కొన్నిసార్లు ప్రాణ నష్టం కూడా జరిగింది. ఇవాళ హైదరాబాదులో వాయుసేనకు చెందిన ఓ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో తీవ్ర ఆందోళన నెలకొంది.
ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్)కు చెందిన శిక్షణ విమానం కిందికి దిగే సమయంలో హైడ్రాలిక్ వింగ్స్ తెరుచుకోలేదు. దాంతో ఆ విమానం 40 నిమిషాల పాటు గాల్లోనే చక్కర్లు కొట్టింది. చివరికి ఎలాగోలా పైలెట్లు ఆ విమానాన్ని బేగంపేట విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. విమానంలో పైలెట్లు సహా మొత్తం 12 మంది సురక్షితంగా ఉండడంతో, అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ సమావేశం



**మార్చి 1జర్నలిస్ట్ వార్త:** హైదరాబాద్ : సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో శుక్రవారం రాత్రి కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశం అయ్యింది. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ హరీష్‌చౌదరితో పాటు మరో ఇద్దరు సభ్యులు సైతం ఇందులో పా ల్గొన్నారు. వారితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, డి ప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమా ర్ రెడ్డిలు ఉన్నారు. ముఖ్యంగా పార్లమెం ట్ సీట్లకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై ఈ సమావేశంలో చర్చించినట్టుగా తెలిసింది. 17 నియోజకవర్గాలకు సుమారుగా 300 లకు పైచిలుకు దరఖాస్తులు రావడంతో వా టిని టిపిసిసి ఇప్పటికే వడబోత చేపట్టింది. అందులో భాగంగానే మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డిని సిఎం రేవంత్ అభ్యర్థిగా ప్రకటించగా మిగతా 16 మంది అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఉత్కంఠగా మారింది.
ఈ 16 సీట్లకు భారీగా ఆశావహులు పైరవీలు చేస్తుండడంతో ఇది అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలోనే మిగిలిన 16 సీట్లకు అభ్యర్థుల ఎంపికలో సునీల్ కనుగోలు సర్వేతో పాటు ఆయా నియోజకవర్గాల్లో ఆశావహుల బలాబలాల గురించి ఈ సమావేశంలో చర్చించినట్టుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ హరీష్‌చౌదరి బలహీనంగా ఉన్న పలు నియోజకవర్గాల గురించి ఆరా తీసినట్టుగా తెలిసింది. ఆయా నియోజకవర్గాల్లో కొత్త వారిని పార్టీలో చేర్చుకొని వారికి సీటును కేటాయిస్తే ఎలా ఉంటుంది, పాత వారిలో అభ్యర్థుల బలబలాలపై గురించి సిఎం రేవంత్‌ను, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీని ఆయన అడిగి తెలుసుకున్నట్టుగా సమాచారం.త్వరగా అభ్యర్థుల ఎంపిక జరగాలని ఏఐసిసి అధిష్టానం ఆదేశించిన నేపథ్యంలో స్క్రీనింగ్ కమిటీ ఈ సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఇప్పటికే పలువురు పార్టీలో చేరిన వారితో పాటు చేరే వారి గురించి స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ దృష్టికి సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టిలు తీసుకెళ్లినట్టుగా తెలిసింది. అయితే కొన్ని ప్రాంతాల్లో వారికి సీట్లను కేటాయిస్తే పార్టీ కచ్చితంగా గెలిచే అవకాశం ఉన్నట్టుగా వారు చైర్మన్‌కు సూచించినట్టుగా సమాచారం. దీంతోపాటు ఖమ్మం లేదా భువనగిరి నుంచి రాహుల్‌గాంధీ పోటీ చేసేలా ఒప్పించాలని వారు స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ హరీష్‌చౌదరితో పేర్కొన్నట్టుగా తెలిసింది.

# ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లను గుర్తించండి: ఫోన్ పే

**మార్చి 1జర్నలిస్ట్ వార్త:**
హైదరాబాద్ : డిజిటల్ ఒరవడి బ్యాంకింగ్, లావాదేవీలు, పెట్టు-బడుల కార్యకలాపాలను కాలంతో పాటు- సులభతరం చేస్తోంది. కానీ మోసగాళ్లు ఆన్‌లైన్ లావాదేవీల్లో అవకాశాన్ని కనుగొంటూ అమాయకులను తెలివిగా బురిడీ కొట్టిస్తున్నారు. ఫోన్ పే నుండి తాము ప్రజలు ఇలాంటి మోసాల ద్వారా దోపిడీకి గురి కాకుండా ఉండేందుకు, మోసాలకు సంబంధించిన అనేక ఉదంతాల గురించిన సమాచారాన్ని పంచుకునేలా ఎప్పటికప్పుడు నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాము. ఆ క్రమంలోనే ఈ కథనం ద్వారా తాము ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్ గురించి వివరించే ప్రయత్నం చేస్తున్నాము.




### ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్ అంటే ఏమిటి ?

తప్పుడు సమాచారం ఆధారంగా మదుపుదారులు పెట్టు-బడి పెట్టాలనుకున్నప్పుడు బ్రోకర్ వేషంతో ఒక మోసగాడు వ్యవహరించినప్పుడు లేదా ఒక నకిలీ వెబ్ సట్‌లో ట్రేడింగ్ చేసేలా ప్రజలను మోసగించాలనుకున్నప్పుడు ఈ ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్ చోటు- చేసుకుంటు-ంది. ఈ పెట్టు-బడి స్టాక్‌లు, బాండ్లు, అసెట్లు- తదితరాల రూపంలో ఉండవచ్చు.

### మోసగాళ్లు ఎలా వ్యవహరిస్తారు?

మోసగాళ్లు తరచుగా పెట్టు-బడిదారులకు ఎలాంటి రిస్క్ లేకుండా నమ్మశక్యం కానంత లాభాలను ఇవ్వజూపుతారు. ఇతరులు పొందుతున్న ప్రయోజనాన్ని మీరు కోల్పోతున్నారనే ఆందోళనను మీలో కలిగించాలనేదే దీనివెనుక వారి ఉద్దేశ్యంగా ఉంటు-ంది. ఈ తరహా మోసగాళ్లు విశ్వసనీయమైన, అధికారికమైన ట్రేడింగ్ ప్లాట్‌ఫారంలు లేదా పెట్టుబడి వ్యాపారాలుగా అనుకరించే సోషల్ మీడియా, వెబ్‌సైట్ల మార్గంలో తమంతతాముగా ఆన్‌లైన్ ప్రచారం చేసుకుంటారు. ఈ రకాల మోసాల కుట్రదారులు తరచుగా తమకు స్థానిక లేదా జాతీయ ఆర్థిక చట్టాల నుండి మినహాయింపు ఉందని చెప్పుకుంటారు. వారు నిధులను తమ ఆధీనంలో ఉంచుకుని, నకిలీ పన్నులు, ఫీజులు లేదా ఇతర ఛార్జీలను డిమాండ్ చేయడం ద్వారా మిమ్మల్ని మోసగించే ప్రయత్నం చేయవచ్చు. చాలావరకు ట్రేడింగ్ స్కామ్‌లు సోషల్ మీడియాలో లేదా మెసేజింగ్ అప్లికేషన్ల ద్వారా ప్రారంభమవుతాయి. మీకు ఊహించని రీతిలో ఎవరైనా వ్యక్తి నుండి కాల్ వస్తే లేదా మీరు ఎన్నడూ వినని ఒక ట్రెండింగ్ వెబ్‌సైట్‌కు మిమ్మల్ని పరిచయం చేసిన వ్యక్తిని ఆన్‌లైన్‌లో కలిసినా, అది ఒక స్కామ్ అయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఎంత డబ్బు మీరు సంపాదించవచ్చు, ఎంత సులభంగా, రిస్క్ లేకుండా ఉంటు-ందని వారి ఇచ్చే హామీలతో సంబంధం లేకుండా మీరు ఇలాంటి స్కామ్ ట్రేడింగ్ వెబ్‌సైట్‌కు పంపే ఎంత డబ్బునైనా మీరు కోల్పోతారు.

### సోషల్ మీడియాలో వెతకడం, బాధితులు కాగల వారికోసం సోషల్ మీడియా, మెసేజింగ్ అప్లికేషన్లను వెతకడంతో పాటు- కింది సంకేతాలు కూడా ట్రేడింగ్ స్కామ్ జరిగే అవకాశాలను సూచిస్తాయి.:

1.అవాస్తవిక లాభాలు: చిన్న పెట్టు-బడులతో నమ్మశక్యం కానంత లాభాలను అందుకోవచ్చునే ఆలోచనను మోసపూరిత బ్రోకర్లు విస్తృతంగా ప్రచారం చేస్తారు.

2.పెట్టుబడిని ఉపసంహరించుకోవడం సాధ్యం కాదు: లాభాలు పెరిగిన తరుణంలో, నగదును ఉపసంహరించుకోవాలని పెట్టు-బడిదారు కోరుకున్నప్పుడు ఉద్దేశించిన ఆదాయాలను యాక్సెస్ చేసుకోలేకపోతున్నట్టు- కనిపిస్తుంది. దీనికి సమాధానాలు కోరినప్పుడు, ట్యాక్సులు, కమిషన్ల పేరుతో అర్థం, పర్థం లేని సాకులు చెబుతారు. నిధుల ఉపసంహరణకు ట్యాక్సులు, కమిషన్ల పేరుతో యాక్సెస్ ఇవ్వకపోవడమనేది ఉత్తుత్తిదేనని బాధితుడు తెలుసుకుంటారు. కానీ అప్పటికే డబ్బును తిరిగి ఇచ్చే ఉద్దేశ్యం మోసగాడికి లేదనే విషయం నిరూపితమవుతుంది.
3.మెరుగైన లాభాలకోసం ఎక్కువగా పెట్టుబడి: తెలివైన మోసగాళ్లు తమ వైఖరిని సమర్థించుకునేలా కొత్త, కొత్త కథలు అల్లుతూ, త్వరలోనే ఉపసంహరించుకోవచ్చనే హామీతో మరింత డబ్బును అడుగుతూనే ఉంటారు. 4.స్పందన లేకపోవడం: మోసగాళ్లు మనం కాల్ చేసినప్పుడు స్పందించరు. మన వద్ద నుండి పెద్ద మొత్తంలో డబ్బును పిండుకున్న తర్వాత మనకు ఎప్పుడూ అందుబాటు-లో ఉండరు. అసలు సమాధానమే ఉండదు. మోసాలకు సంబంధించిన కొన్ని సంకేతాలపై కన్నేసి ఉంచడం ద్వారా ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్ ను గుర్తించడం వీలవుతుంది. ఒక ట్రేడింగ్ స్కామ్‌కు బలవుతున్నట్టు- మీకు అనుమానం ఏర్పడితే, నష్టాన్ని వీలైనంత మేర తగ్గించుకునేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టి, మరింత నష్టాలు జరగకుండా చూడడం చాలా ముఖ్యం. ఈ రకమైన ఆన్‌లైన్ స్కామ్‌లను గుర్తించడం సాధ్యమవుతుంది. మీరు ట్రేడింగ్ స్కామ్‌కు గురైనట్లు- మీరు అనుమానించినట్లయితే, దానివల్ల జరిగే నష్టాలను తగ్గించడానికి, తదుపరి నష్టాలను నివారించడానికి తక్షణ చర్య తీసుకోవడం చాలా ముఖ్యం. ఫోన్ పే యాప్‌లో లేదా కస్టమర్ కేర్ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా లేదా ఫోన్ పే సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో మీరు అలాంటి స్కామ్‌లను నివేదించవచ్చు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓట్లు అడిగే హక్కులేదు

## మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

**మార్చి 1జర్నలిస్ట్ వార్త:** హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని బీజేపీ నేత, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు.
కాళేశ్వరం అవినీతి విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కేసీఆర్ కుటుంబాన్ని కాపాడేందుకే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టును కాకుండా కేవలం



మేడిగడ్డ బ్యారేజీని మాత్రమే పట్టుకుందన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతోంది కాంగ్రెస్ మాత్రమేనని, లేకపోతే బీఆర్ఎస్ అడ్రస్ లేకుండా పోయేదన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఇతర నాయకులతో కలిసి కొండా విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడారు. లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేయకపోవడం వల్ల బీఆర్ఎస్‌తో బీజేపీ కుమ్మక్కయిందని విమర్శలు చేస్తున్నారని, అయితే అందులో ఏమా త్రం వాస్తవం లేదన్నారు. కేసీఆర్ రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసి వెళ్తే, ప్రజలు ఇబ్బందులు పడకూ డదని కేంద్రం నిధులు ఇస్తోందన్నారు. తెలంగాణలో బీజేపీని 14, 15 ఎంపీ సీట్లలో గెలిపిస్తే 9 లక్షల కోట్లు కాదు, రూ.25 లక్షల కోట్లు తీసుకొస్తా మని చెప్పారు. తనకు ఇంకా చేవెళ్ల టికెట్ కేటాయింపుపై పార్టీ హామీ ఇవ్వలేదని, టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తాననే ధీమా వ్యక్తం చేశారు.

# ఛాంపియన్‌గా పుణెరి పల్టాన్





**మార్చి 1జర్నలిస్ట్ వార్త:** హైదరాబాద్ కాళ్లు చుట్టేయడం.. వెనకాల నుంచి ఒక్కసారిగా ఎత్తి పడేయడం! తాము రైడింగ్‌కు వెళ్తే.. ముందుకు సాగి పాయింట్ తేవడం.. ఒక్కసారిగా ఎగిరి బయటకు రావడం.. చుట్టుముట్టినా తప్పించుకోవడం! ఇలా.. ట్యాక్లింగ్‌లో, రైడింగ్‌లో అదరగొట్టిన పుణెరి పల్టాన్ తొలిసారి ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) ఛాంపియన్‌గా నిలిచింది. పదో సీజన్ ఫైనల్లో హరియాణా స్టీలర్స్‌ను ఓడించింది. నిరుడు రన్నరప్‌గా నిలిచిన ఆ జట్టు.. ఈ సారి వదల్లేదు. లీగ్ దశను అగ్రస్థానంతో ముగించిన ఆ జట్టు.. కప్పునూ పట్టేసింది. డిఫెండర్ల ఆధిపత్యంతో మొదలై.. రైడర్ల హవాతో ముగిసిన పీకేఎల్ పదో సీజన్ తుదిపోరులో పుణెరి పల్టాన్‌దే విజయం. ఛాంపియన్ లాగే ఆడిన ఆ జట్టు.. టైటిల్ పట్టేసింది. శుక్రవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో పుణెరి 28-23 తేడాతో హరియాణా స్టీలర్స్‌ను ఓడించింది. రైడింగ్‌లో పంకజ్ మోహితె (9), మోహిత్ గోయత్ (5).. ట్యాక్లింగ్‌లో గౌరవ్ ఖత్రి (4).. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో కెప్టెన్ అస్లాం ముస్తాఫా (4) రాణించి జట్టును గెలిపించారు. హరియాణా జట్టులో శివమ్ (6) మాత్రమే ఫర్వాలేదనిపించాడు. స్టార్ డిఫెండర్, కెప్టెన్ జైదీప్ విఫలమవడం హరియాణాకు చేటు చేసింది. మ్యాచ్ ఆరంభంలో 3-0తో పుణెరి ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ మోహిత్‌ను పట్టేసి పాయింట్ల ఖాతా తెరిచిన హరియాణా క్రమంగా పుంజుకుంది. మొదట్లో డిఫెండర్లదే ఆధిపత్యం. తొలి 12 నిమిషాల్లో రెండు జట్లు కలిపి 11 పాయింట్లు సాధించగా ఇందులో 8 ట్యాక్లింగ్‌లో వచ్చినవే. ప్రమాదకర డిఫెండర్ మహమ్మద్రెజాను రైడర్ శివమ్ ఔట్ చేయడంతో హరియాణా 6-6 తో స్కోరు సమం చేసింది. అక్కడి నుంచి పోరు మరో స్థాయికి చేరింది. ఒక్కో పాయింట్ కోసం.. పాయింట్ సాధించే అవకాశం కోసం.. రెండు జట్లూ నువ్వానేనా అన్నట్లు తలపడ్డాయి. ఆధిక్యం కోసం పట్టుబట్టిన ఇరు జట్లు.. డూ ఆర్ డై రైడ్‌లో మాత్రమే పాయింట్లు సాధించేందుకు ప్రయత్నించాయి. ఇలాంటి రైడ్‌లోనే పంకజ్ ఏకంగా నాలుగు పాయింట్లు సాధించాడు. జైదీప్ ట్యాక్లింగ్‌ను దాటి గీత వైపు దూసుకొచ్చే క్రమంలో మరో ముగ్గురు ఆటగాళ్లు వచ్చి పట్టుకున్నారు. దీంతో 13-7తో పుణెరి ఆధిక్యంలోకి వెళ్లింది. ప్రత్యర్థి కోర్టులో ఒక్క ఆటగాడే మిగిలాడు. దీంతో తొలి అర్ధభాగంలోనే హరియాణాను ఆలౌట్ చేసే అవకాశాన్ని పుణెరి సృష్టించుకుంది. కానీ సబ్‌స్టిట్యూట్ రైడర్‌గా వచ్చిన విశాల్.. బోనస్‌తో పాటు ఓ టచ్ పాయింట్ తెచ్చి హరియాణా ఆశలు నిలిపాడు. పుణెరి 13-10తో విరామానికి వెళ్లింది. ద్వితీయార్ధంలో హరియాణాను ఆలౌట్ చేసి 18-11తో ఆధిక్యాన్ని పెంచేసుకుంది. మరోవైపు హరియాణా కూడా ఒక్కో పాయింట్ సాధిస్తూ సాగిపోయింది. కానీ ప్రత్యర్థిని అందుకోలేకపోయింది. పంకజ్ నిలకడగా పాయింట్లు తేవడంతో పుణెరి మరో 10 నిమిషాల ఆట ఉందనగా 22-16తో నిలిచింది. ఆఖరి అయిదు నిమిషాల ఆట ఉందనగా పుణెరి 24-19తో విజయం ఖాయం చేసుకుంది. శివమ్‌ను వెనుక నుంచి వచ్చి గౌరవ్ అమాంతం ఎత్తేసి బయటకు పంపించిన తీరు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన హరియాణా రైడర్ సిద్ధార్థ్ దేశాయ్.. ఒకే రైడ్‌లో రెండు పాయింట్లు తేవడంతో హరియాణా 23-28తో నిలిచింది. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది. ఎలాంటి నాటకీయత లేకుండా పుణెరి మ్యాచ్ ముగిసింది. పుణెరి ఆటగాళ్లందరూ కోర్టులో ఆనందంతో నృత్యం చేశారు.

పీకేఎల్‌లో ఛాంపియన్‌గా నిలిచిన ఏడో జట్టు పుణెరి పల్టాన్. పట్నా పైరేట్స్ (2016లో 3వ, 4వ సీజన్, 2017లో) మూడు సార్లు, జైపుర్ పింక్ పాంథర్స్ (2014, 2022) రెండు సార్లు, యు ముంబా (2015), బెంగళూరు బుల్స్ (2018), బెంగాల్ వారియర్స్ (2019), దబంగ్ దిల్లీ (2021) ఒక్కో సారి కప్పు దక్కించుకున్నాయి.

రూ.3 కోట్లు:విజేతగా నిలిచిన పుణెరి పల్టాన్ అందుకున్న నగదు బహుమతి. రన్నరప్ హరియాణా రూ.1.8 కోట్లు సొంతం చేసుకుంది.

## హాలీవుడ్ ని షేక్ చేస్తున్న చరణ్ క్రేజ్..!



ముందు వరకు కేవలం ప్రాంతీయ హీరోలుగా ఉన్న చరణ్, ఎన్.టి.ఆర్ లను ఆ సినిమాతో గ్లోబల్ స్టార్స్ గా క్రేజ్ తెచ్చుకునేలా చేశాడు రాజమౌళి. చరణ్ చేసిన రామరాజు పాత్ర.. తారక్ చేసిన భీం పాత్ర ఇద్దరి పాత్రలకు వారి ఎఫర్ట్స్ తెర మీద అద్భుతంగా ఆవిష్కరించపడ్డాయి. సినిమా పాన్ ఇండియా లెవెల్ లో హిట్టైనా ఆ సినిమా పాటకు ఆస్కార్ వచ్చిన టైం లో మన స్టార్స్ కి గ్లోబల్ వైజ్ గుర్తింపు వచ్చింది. చరణ్, ఎన్.టి.ఆర్ ఇద్దరి గురించి హాలీవుడ్ మీడియాలో కూడా క్రేజీ డిస్కషన్ నడిచింది. ఇక లేటెస్ట్ గా ఆ క్రేజ్ కొనసాగిస్తూ ఒక హాలీవుడ్ సినిమాకు కాస్టింగ్ కాల్ ఇస్తూ నటీనటులకు కావాల్సిన క్వాలిటీస్ ని ఫోటో రూపంలో చూపిస్తూ లో రామ్ చరణ్ నటించిన పోలీస్ ఫోటో వేసి అలాంటి లుక్, ఫిజిక్ ఉన్న నటీనటులు కావాలని ప్రకటించారు. ట్రిపుల్ ఆర్ సినిమాలో చరణ్ పాత్ర ఎంతగా ఇంపాక్ట్ చేసిందో ఈ ప్రకటనని బట్టి చెప్పొచ్చు. ఆ పాత్ర కోసం చరణ్ తెర వెనుక పడిన కష్టం చాలా గొప్పది. అందుకే అతనికి అంత గొప్ప గుర్తింపు వచ్చేలా చేసింది. సినిమా రిలీజై రెండేళ్లు అవుతున్నా ఇప్పటికీ తమ సినిమాలో కావాల్సిన యాక్టర్ కి రామరాజు పాత్ర తాలూఖా ఫిజిక్ కావాలని చెప్పడం చూస్తుంటే ఆ పాత్రకు చరణ్ చేసిన న్యాయం ఎంతన్నది అర్థం చేసుకోవచ్చు. గ్లోబల్ వైడ్ గా చరణ్ క్రేజ్ మరోసారి చాటి చెప్పేలా ఈ సినిమా ఆడిషన్ కాల్ మెగా ఫ్యాన్స్ ని ఫుల్ ఖుషి చేస్తుంది. ఇక చరణ్ సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం శంకర్ డైరెక్షన్ లో చేస్తున్న గేమ్ చేంజర్ ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. దసరాకి రిలీజ్ అవుతుంది అనుకున్న గేమ్ చేంజర్ సినిమా డిసెంబర్ లో రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా తర్వాత బుచ్చి బాబు డైరెక్షన్ లో చరణ్ సినిమా లైన్ లో ఉంది. పీరియాడికల్ మూవీగా రాబోతున్న ఈ సినిమాలో చరణ్ పాత్ర సంథింగ్ స్పెషల్ గా ఉంటుందని తెలుస్తుంది. ఈ సినిమాలో జాన్వి కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా ఏ ఆర్ రెహమాన్ మ్యూజిక్ అందించనున్నారు. ఈ సినిమాను కూడా గ్లోబల్ లెవెల్ లో నిలబెట్టేలా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. సినిమాలో చరణ్ పాత్ర డిఫరెంట్ వేరియేషన్స్ తో అదిరిపోతుందని చెబుతున్నారు.


## పెళ్లి గురించి శ్రీముఖి ఏమంటోంది ?



శ్రీముఖి అలియాస్ బుల్లి తెర రామలమ్మ క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. చిన్న తెరపై ఎంత కాంపిటీ షన్ ఉన్నా రాములమ్మ ప్రత్యేకత మాత్రం వేరు. యాంకర్లందరికంటే సమ్ థింగ్ స్పెషల్ అట్రాక్షన్ అమ్మ డి సొంతం. తనలో ఆ రేర్ క్వాలిటీనే మిగతా వాళ్ల నుంచి వేరు చేస్తుంది. సరైనా సినిమా ఛాన్సులు పడ లేదు..లేదంటే అక్కడా చిచ్చర పిడుగులా చెలరేగేది. అయినా అంది వచ్చిన ఏ అవకాశాన్ని విడిచి పెట్టడం లేదు. తన లో హాట్ అప్పిరియన్స్ ని సందర్భం చిక్కినప్పుడల్లా ఇన్ స్టా వేదికగా షేర్ చేస్తూనే ఉంటుంది. అలాగే నటిగానూ సత్తా చాటే ప్రయత్నాలు చేస్తుంది. తాజాగా అమ్మడి వయసు నాలుగు పదులకు వస్తున్నా ఇంకా భాజాలు మోగించేది? లేదా? అన్న ప్రశ్న సొగసరి ముందుకెళ్లడంతో ఆసక్తిర విషయాలు పంచుకుంది. 'వయసుతో పాటే పెళ్లి ప్రశ్నలు కూడా ఎక్కువ అవుతున్నాయని..ఎక్కడికి వెళ్లినా పెళ్లి ఎప్పుడు? అని అందరూ అడుగున్నారని అంది. అలాగే ఇంట్లో వారు పెళ్లి చేసుకోమని ఒత్తిడి తీసుకురాలేదా? అని బయట జనాలు అడుగుతున్నారంది. కానీ తన విషయంలో తల్లిదండ్రులు పూర్తి స్వేచ్ఛ కల్పించారని..ఎప్పుడు చేసుకోవాలనుకుంటే అప్పుడే చేసుకోమని చెప్పారని తెలిపింది. అలాగే గతంలో తనకి ఓ లవర్ ఉండేవాడని..అతడితో ఇప్పుడు బ్రేకప్ అయిందని అప్పటి నుంచి ప్రేమకు దూరంగా ఉంటున్నట్లు తెలిపింది. ప్రస్తుతం శ్రీముఖి యాంకర్ గా దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. అనసూయ నటిగా బిజీ అవ్వడంతో ఆస్థానాన్ని అమ్మడు భర్తీ చేసిందని చెప్పొచ్చు. సుమ లాంటి సీనియర్ యాంకర్లు ఉన్నా అక్కా అంటూ కలుపుకుని కొత్త అవకాశాలు ఒడిసి పట్టుకుంటుంది. ఆ సీనియర్ రేసు నుంచి తప్పుకుంటే ఆస్థానం తనదే అవుతుంది అన్న ధీమాతోనూ కనిపిస్తుంది.

## ఓదెలా 2.. పవర్ఫుల్ సీక్వెల్ లో మిల్కీ బ్యూటీ






గ్లామరస్ బ్యూటీగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును అందుకున్న తమన్నా భాటియా ప్రస్తుతం డిఫరెంట్ ప్రాజెక్టులను లైన్లోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. తన ప్రతి సినిమాలో కూడా ఒక వైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే మరొకవైపు లేడీ ఓరియంటెడ్ ప్రాజెక్టులు కూడా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తోంది. ఇక ప్రస్తుతం ఈ బ్యూటీ మరొక డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమాలో ప్రధాన పాత్రలో కనిపించబోతోంది. ఆ సినిమాకు ప్రముఖ మాస్ దర్శకుడు సంపత్ నంది క్రియేటర్ గా ఉండగా అశోక్ తేజ దర్శకత్వం వహించబోతున్నారు. సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన ఒక పోస్టర్ ద్వారా తెలియజేశారు. ఓదెల 2 అనే టైటిల్ తో ఈ ప్రాజెక్టు తెరపైకి రాబోతోంది. 2022లో ఓటీటీలో విడుదలైన ఓదెల రైల్వే స్టేషన్ మంచి రెస్పాన్స్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ క్రైమ్ త్రిల్లర్ కథను సంపత్ నంది అందించారు. డైరెక్టర్ అశోక్ తేజ మేకింగ్ విధానం సినిమాలో బాగా హైలైట్ అయింది. ఇక అదే టీం తో ఇప్పుడు ఓదెల 2 అనే టైటిల్ తో మరొక ప్రాజెక్టును వెండితెరపై తీసుకురాబోతున్నారు. ఈసారి అంతకుమించిన కథనంతో భారీ క్యాస్టింగ్, బెస్ట్ ప్రొడక్షన్, హై టెక్నికల్ వాల్యూస్ తో సినిమాను రూపొందిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఈ కథ యూనివర్సల్ గా అందరికి కనెక్ట్ అయ్యేలా ఉంటుందట. కేవలం తెలుగులోనే కాకుండా మిగతా భాషల్లో కూడా విడుదల చేయాలని అనుకుంటున్నారు. మధు క్రియేషన్స్ లో %ణ% మధు ఈ ప్రాజెక్టు ను నిర్మిస్తున్నారు. ఇక సినిమాను ఈరోజు అధికారికంగా లాంచ్ చేస్తూ రెగ్యులర్ షూటింగ్ ను త్వరలోనే స్టార్ట్ చేసే విధంగా ప్లాన్ అయితే సిద్ధం చేసుకున్నారు. సినిమా కథ విషయానికి వస్తే ఓదెల మల్లన్న స్వామి ఒక గ్రామాన్ని దుష్ట శక్తుల నుంచి ఇలా రక్షిస్తాడు అనే పాయింట్ తో రాబోతున్నట్లు సమాచారం. ఇక టైటిల్ పోస్టర్ లో త్రిశూలంలో శివుడి బొట్టు హైలెట్ అయ్యే విధంగా ఉంది. ఈ సినిమాకు కాంతార ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నాడు. తప్పకుండా సినిమా అంచనాలకు తగ్గట్టుగా ఉంటుంది అని తెలుస్తోంది. ఓదెలా 2 సినిమాలో హెబ్బా పటేల్, వశిష్ఠ, యువ, నాగమహేష్, వంశీ, గగన్ విహారి, సురేందర్ రెడ్డి, భూపాల్, పూజా రెడ్డి లాంటి వారు నటిస్తున్నారు.